క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్ అవగాహన మరియు స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులకు క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని నరాల, గుండె జబ్బుల, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. అలాగే గంగిరెడ్డి ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, ఈ సెంటర్‌లో కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 99631 70177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

పులివెందుల టౌన్ : 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఈనెల 1వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఉచితంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. శనివారం ఆయన తెలుపుతూ యోగా గురువు వెంకట్రామిరెడ్డిచే యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతోందని, ఆసక్తిగలవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9866556183, 9866556180, 9866470812 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

సింహాద్రిపురం : ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగేశ్వరరావు, వీఆర్‌ఓ గోపాల్‌ల పదవీ విరమణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. అనంతర వారిని పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరిబాబు, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ప్రముఖుల చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకుంటున్న కోలా ప్రసాద్

పులివెందుల టౌన్ : దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కోలా ప్రసాద్‌కు భూషణ్ క్రిష్టియన్ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శనివారం ఊటీలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూషణ్ క్రిష్టియన్ యూనివర్సిటీ ఫర్ ఫారిన్ స్టడీస్ కొరియా వారు ×హిజ్ ఎక్స్‌లెన్సీ సర్టిఫికెట్ యూకే ఆఫ్ లండన్ డాక్టరేట్‌ను ప్రదానం చేయడం జరిగిందన్నారు.

డిగ్రీ పూర్తి చేస్తే ఉద్యోగావకాశాలు

జమ్మలమడుగు : ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు కచ్చితంగా ఉద్యోగం చేతిలో పట్టుకుని వెళ్లవచ్చు అని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక డిగ్రీకాలేజీలోని ఆయన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ కాలేజీకి ప్రభుత్వం న్యాక్ బీగా గుర్తించడం జరిగిందని దీని ద్వారా తమ కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న 1400కుపైగా కంపెనీల ద్వారా ఉద్యోగా వకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే చాలా మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఒక్కసారి ఆలోచన చేసి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేర్పించాలన్నారు. తమ కాలేజీలో మొత్తం 16 మంది అధ్యాపకులు ఉండగా అందులో 11 మంది డాక్టరేట్ పొందిన వారు ఉన్నారన్నారు.

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం

కడప కోటిరెడ్డిసర్కిల్: పొగాకు వాడకం కేన్సర్ మహమ్మారికి కారణంగా మారగలదని ఫాతిమా మెడికల్ కళాశాల వైద్యులు తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొంతమంది సరదా కోసం పొగాకు తాగడం అలవాటు చేసుకుంటే వ్యసనంగా మారుతుందన్నారు. ఈ అలవాటుకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నాగేష్, రామమనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌తో అధిక పాల దిగుబడులు

- పశు పోషకులు టీకాలు తప్పని సరిగా వేయించాలి
- జాగ్రత్తలు పాటించి పశువులకు రోగాలు దూరం చేయండి



పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

కమలాపురం : పశు పోషకులు తమ పశువులకు తప్పని సరిగా టీకాలు వేయించాలని, పశు వైద్యాధికారులు తెలియజేసే సలహాలు, సూచనలు పాటించి తమ పశువులను రోగాలకు దూరం చేసి అధిక పాల దిగుబడులను సాధించి తమ జీవన ప్రమాణాలు పెంచుకోవాలని కమలాపురం మండల పశు వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. ముఖ్యంగా ఈ వర్షాకాలంలో పశువులకు సంక్రమించే వివిధ రోగాలు, వాటి లక్షణాలు, నివారణ చర్యలు తెలియజేశారు. ముఖ్యంగా పశువులకు రోగాలు దరి చేరకుండా గ్రామాల్లో నిర్వహించే వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులకు టీకాలు తప్పని సరిగా వేయించాలని ఆయన సూచించారు.

గొంతు వాపు వ్యాధి

ప్రస్తుతం అన్ని గ్రామాల్లో గొంతు వాపు వ్యాధి నివారణకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేస్తున్నారు. పశు పోషకులు తప్పని సరిగా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలి. 3 నెలల పైబడి దూడలు, బుడ్డ దూడలు ఈ వ్యాధి బారిన పడతాయి. అలాగే గేదెల్లో కూడా ఈ వ్యాధి ప్రబలుతుంది. అధిక జ్వరం ఉండటం, గొంతు కింద వాపు ఉండటం, నోటి నుంచి జొల్లు కారడం తదితర లక్షణాలు పశువుల్లో ఉంటాయి. ఈ వ్యాధి నివారణకు ఖరీదైన యాంటి బాటిక్స్ వాడాల్సి వస్తుంది. కాబట్టి పశు పోషకులు ముందే మేల్కొని తమ పశువుల వ్యాధి నివారణకు గొంతు వాపు వ్యాక్సిన్ వేయించుకోవాలి. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న శిబిరాలను తప్పకుండా వినియోగించు కోవాలి.

గాలి కుంటు వ్యాధి

పెద్ద పశువులైన గేదెలు, ఆవులు, ఎద్దులు తదితర అన్ని తెల్లజాతి పశువులకు ఈ వ్యాధి సంక్రమిస్తుంది. ఆగష్టు, సెప్టెంబర్ మాసాల్లో ఈ వ్యాధి ప్రబలుతుంది. వ్యాధి బారిన పడిన పశువులకు అధిక జ్వరం, నాలుక, గిట్టలపై పుండ్లు ఏర్పడుతాయి. నోరంతా అల్సర్ లాగా మారిపోతుంది. గిట్టలు పగులుతాయి. జొల్లు కార్చుకుంటూ ఉంటాయి. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు అబార్షన్ అయ్యే అవకాశం కూడా ఉంది. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందించే వ్యాక్సిన్లు తప్పక వేయించుకోవాలి.

నీలి నాలుక వ్యాధి

గొర్రెలలో ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుంది. వర్షా కాలంలో వచ్చే ఈగల వలన ఈ వ్యాధి సంక్రమిస్తుంది. అలాగే ఒక గొర్రె నుంచి మరో గొర్రెకు ఈ వ్యాధి ప్రబలుతుంది. వ్యాధి బారిన పడిన గొర్రెలకు అధిక జ్వరం రావడంతో పాటు చెక్కిళ్లు (పై పెదవి, కింది పెదవి) ఎర్రగా మారి పోతాయి. కాళ్లు కుంటుతాయి. ముక్కుల్లోంచి చీమిడి కారుతుంది. ఈ వ్యాధి కి సంబంధించిన ఒక వైరస్ 26 రకాల వేరియంట్లుగా ఉంటాయి. వ్యాక్సిన్ వేస్తే ప్రమాద తీవ్రత తగ్గుతుందే గాని, మృతి చెందటాన్ని పూర్తిగా నివారించలేము. జూన్ నెలలో ఈ వ్యాధులు ప్రబలుతాయని, పశు పోషకులు జాగ్రత్తగా ఉండి వ్యాక్సిన్ వేయించుకోవాలి.

పారుడు వ్యాధి

ఏడాది, ఏడాదిన్నర గొర్రె, మేక పిల్లలు ఈ వ్యాధికు గురవుతాయి. ఈ వ్యాధి బారిన పడిన చిన్న పశువులకు రక్తపు చారికలు ఉంటాయి. కళ్ల వెంబడి నీరు కారడం, శ్వాసకోశ సంబంధ సమస్యలు ఉంటాయి. దీని నివారణకు పీపీపీ వ్యాక్సిన్ వేస్తామని, పశు పోషకులు ఈ వ్యాక్సినేషన్‌ను వినియోగించుకోవాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పెద్ద, చిన్న పశువులకు ప్రతి నెలా వచ్చే వ్యాధులను బట్టి వ్యాక్సినేషన్ చేస్తుంటాము. పశు పోషకులు గ్రామాల్లో నిర్వహించే వ్యాక్సినేషన్ శిబిరాలకు తమ పశువులకు తీసుకువచ్చి వ్యాక్సిన్ తప్పక వేయించుకోవాలి. అలా వ్యాక్సినేషన్ చేయించుకుంటే పశువుల్లో పాల దిగుబడి పెరగుంది. తద్వారా మీ ఆదాయం కూడా బాగా పెరుగుతుంది. పశు పోషకులు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–డా.మల్లికార్జునరెడ్డి, మండల పశు వైద్యాధికారి, కమలాపురం.

రైతు వాక్కు..

రైతు భరోసా ఊసే లేదు



కూటమి ప్రభుత్వంలో రైతులను ఆదుకోవడంలో విఫలమైంది. ఏడాది పాలన పూర్తికావస్తున్నా ఇప్పటివరకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. ఏడాదికి రూ.20వేలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైంది. సన్న, చిన్నకారు రైతులు రైతు భరోసా లేక పంటలు సాగు చేయలేని పరిస్థితిలో లేరు.

– చలపతి, రైతు, వేముల

రైతులపై కూటమి సర్కార్ కపట ప్రేమ



రైతులపట్ల కూటమి ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా ఇస్తామని చెప్పిన నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నిలబెట్టుకోలేకపోయారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామిని నిలబెట్టుకుని ప్రతి ఏడాది రైతుకు రూ.13,500లు అమలు చేశారు. కూటమి ప్రభుత్వం రైతులపట్ల నిర్లక్ష్యం చేస్తోంది.

– శివశంకర్‌రెడ్డి, రైతు, మబ్బుచింతలపల్లె.

గత ప్రభుత్వంలో 95 శాతం పనులు పూర్తయ్యాయి

- మిగిలిన శాతం పనులను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలారెడ్డి



హాకీ కోచ్ శేఖర్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలారెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందులలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాల పనులను నిర్వహించారని, అందులో 95 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 5 శాతం పనులు అసంపూర్తిగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలారెడ్డి తెలిపారు. శనివారం పులివెందులలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన క్రికెట్ స్టేడియం, హాకీ స్టేడియం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అరటి కాయల శీతల గిడ్డంగిలను ఆమె వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు శాతం పనులను పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వానికి ఏడాదవుతున్నా కూడా ఆ పనులు చేయించాలన్న కణికరం కూడా లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పులివెందులపై చిన్న చూపే అన్నారు. జగనన్న ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అందులో నాకు నచ్చిన పథకం నాడు–నేడు పథకమన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో సైతం విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలన్న లక్ష్యంతో నాడు–నేడు పథకాన్ని ప్రవేశపెట్టి పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని పైకి వచ్చిన దానినేనన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు శాతం పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలన్నారు. అనంతరం హాకీ స్టేడియంలోని క్రీడాకారులతో మాట్లాడారు. నల్లపురెడ్డిపల్లె రోడ్డులో సుమారు రూ.29 కోట్లతో బనానా ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్ నిర్మించడం జరిగిందన్నారు. రైతులు తమ పండించిన పంటలను ఇక్కడ నిల్వ చేసుకుని ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేసుకునే విధంగా అన్ని సదుపాయాలు ఇక్కడ కల్పించారన్నారు కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటిని పట్టించుకోవడం మానేసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, పద్మనాభరెడ్డి, రవి, మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీప్రసన్న, లక్ష్మీభార్గవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మండలద ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామమల్లేశ్వరరెడ్డి, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



కమలాపురంలో పురుగు మందులను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

కమలాపురం : రైతులకు నాసిరకం విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. శనివారం మండలంలోని విత్తన, పురుగు మందుల దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన, పురుగు మందుల స్టాక్ రిజిష్టర్‌ను, ఇన్ వాయిస్ బిల్లులను డెలివరి చలాన, బిల్లు బుక్కులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాసి రకం విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాలలో నిల్వ ఉన్న సరుకుల వివరాలు, ధరల పట్టికను తప్పని సరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న కారణంగా రైతులకు కావలసిన మేలు రకపు విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పని సరిగా అమ్మకపు బిల్లులను ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ సర్టిఫికెట్ నందు పొందు పరచని విత్తనాలను అమ్మరాదన్నారు. అలాంటి విత్తనాలు విక్రయిస్తే దుకాణా దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు, దుకాణా దారులు తప్పనిసరిగా మొలక శాతాన్ని పరిశీలించిన తర్వాతనే విత్తనాలను భూమిలో విత్తుకోవాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలను సమీపంలోని రైతు సేవా కేంద్రాలలో గాని, అగ్రి ల్యాబ్‌లోగాని విత్తన మొలక శాతాన్ని పరీక్షించుకోవచ్చని వారు తెలిపారు.

నాణ్యమైన విద్యను అందించాలి



రవీంద్ర విద్యా సంస్థను ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

వీరపునాయునిపల్లె : విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. వీరపునాయునిపల్లెలో శనివారం శివదర్శనానంద సరస్వతీ మాతాజీతో కలిసి రవీంద్ర విద్యా సంస్థను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వీరపునాయునిపల్లెకు చెందిన పిల్లలు వేంపల్లె, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు పట్టణాలకు ఉదయం 6 గంటలకే క్యారియర్ తీసుకుని స్కూల్ వ్యాన్‌లలో వెళ్లేవారని ప్రస్తుతం రవీంద్ర విద్యా సంస్థల వారు పాఠశాలను ఏర్పాటు చేయడంతో ఇక్కడే విద్యనభ్యసించేందుకు సౌకర్యం కలిగిందన్నారు. రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది 8వ తరగతి వరకు తరగతులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాల సంఘం జిల్లా అధ్యక్షుడు వేంపల్లె ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, పలు పాఠశాలల యాజమాన్యం, ఎస్ఐ మంజునాథ్ తదితరలు పాల్గొన్నారు.

రేషన్ షాపుల పరిశీలన



లోపట్నూతలలో రేషన్ షాపును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఈశ్వరయ్య

లింగాల : మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్ షాపులను తహసీల్దార్ ఈశ్వరయ్య శనివారం పరిశీలించారు. రేషన్ షాపులలో నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించి వారికి తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను అందించాలన్నారు. అదేవిధంగా ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులను తెరిచి ఉంచాలన్నారు. అలాగే పెద్దకుడాల, చిన్నకుడాల, లోపట్నూతల, పార్నపల్లె తదితర గ్రామాల్లోని రేషన్ షాపులను ఆయన తనిఖీ చేసి అక్కడ నిత్యావసర సరుకుల బోర్డులను ఏర్పాటు చేయించారు.

సబ్ జైలును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్

పులివెందుల : పట్టణంలోని సబ్ జైలును శనివారం సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్ సందర్శించి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసి రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యత గురించి తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం తదితర వాటిపై ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించామని, ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పులివెందుల సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ కూల్చివేత



కూల్చివేతను పరిశీలిస్తున్న కమిషనర్ జగన్నాథ్

కమలాపురం : పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే దారిలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను కూల్చివేశారు. శనివారం నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ పర్యవేక్షణలో, అసిస్టెంట్ ఇంజినీర్ తతిరు వెంగళప్ప ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ సిబ్బంది ఎటువంటి ఆస్తి నష్టం జరగకుండా ట్యాంక్‌ను కూల్చి వేశారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పురాతన ఓవర్ హెడ్ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలి పోయేందుకు సిద్ధంగా ఉండి ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు నగర పంచాయతీ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు గత కొంత కాలంలో ఆ ఓవర్ హెడ్ ట్యాంక్‌లో నీరు నిల్వ చేయడం ఆపి వేశారు. శనివారం సమీప ప్రాంత ప్రజల ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా ఇంజనీరింగ్ సిబ్బంది జాగ్రత్తలు పాటించి ట్యాంక్‌ను కూల్చివేశారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజలలో మండల ఇన్‌చార్జి, జెడ్పీటీసీలు

వేముల : మండలంలోని చాగలేరు గ్రామంలో శనివారం రామాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలో ఆలయాన్ని నూతనంగా నిర్మించి శ్రీసీతారామ, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్టించి ఏడాది పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు శ్రీసీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయంలో ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణోత్సవంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డిలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పురోహితులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్ సురేంద్ర ఏర్పాటు చేసిన ప్రణవ్ డ్రింకింగ్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డిలు ప్రారంభించారు. స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన మినరల్ వాటర్‌ను అందించేందుకు వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు మునీర్‌బాషా, ఎంపీటీసీ బ్రహ్మయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

వేంపల్లె : 2024– 25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా), మహిళా విభాగ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. శనివారం వేంపల్లి పట్టణానికి చెందిన శ్రీమారుతి ఏజెన్సీ యజమాని పోలేపల్లి రామాంజనేయులు సౌజన్యంతో ఈ బహుమతులును ప్రధానం చేసినట్లు ఆవోపా అధ్యక్షులు బైరిశెట్టి వెంకటసునీల్‌కుమార్ తెలిపారు. మొదటి బహుమతి 594 మార్కులు సాధించిన సగల వినయ్‌కుమార్, రెండవ బహుమతి రాయవరం వెంకటసాయి మణికంఠ, మూడవ బహుమతి పోలేపల్లి అనూష్ వర్ధన్‌లకు అందజేశారు. అలాగే బీజీఎస్ ఎలక్ట్రానిక్స్ యజమాని బైరిశెట్టి బాలగంగాధర్ మిగిలిన కొంతమందికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బారావు, నిత్య అన్నదాన సత్రం అధ్యక్షుడు పచ్చిపులుసు మురళీ కిశోర్, ఆవోపా మహిళా విభాగ అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ, పవిత్ర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తప్పుడు మూల్యాంకనంపై విచారణ జరపాలి

కమలాపురం : పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన విద్యాశాఖ చేపట్టిన తప్పుడు మూల్యాంకనంపై విద్యా శాఖామంత్రి లోకేష్ తక్షణం విచారణ జరపాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.ఎం.ఓబులేసు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాశారని, అందులో ఫెయిల్ అయిన తక్కువ మార్కులు వచ్చిన 66,363 మంది విద్యార్థులు మూల్యాంకనంపై దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో ఇప్పటికే 11 వేల మందికి పైగా విద్యార్థులకు ఉత్తీర్ణత, మార్కుల్లో మార్పులు వచ్చాయన్నారు. వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లకు చెందిన మోక్షితకు ముందుగా సాంఘిక శాస్త్రంలో 21 మార్కులు వచ్చాయని, రీ వాల్యుయేషన్ పెడితే 84 మార్కులు వచ్చాయన్నారు. బాపట్ల జిల్లాకు చెందిన తేజస్వినికి సాంఘిక శాస్త్రంలో ముందుగా 23 మార్కులు వచ్చాయని, రీవాల్యుయేషన్ తర్వాత 96 మార్కులు వచ్చాయన్నారు. ఇంటర్‌లో విజయవాడకు చెందిన రాజేశ్వరీకి ఇంగ్లీష్‌లో 5 మార్కులు వచ్చాయని, రీ కౌంటింగ్ పెడితే 95 మార్కులు వచ్చాయని తెలిపారు. మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులు చేసిన తప్పులకు విద్యార్థులు శిక్ష అనుభవిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు మానసిక క్షోభకు గురయ్యారని, మరి కొంత మంది సూసైడ్ కూడా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూల్యాంకనంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలం చెందిందని, విద్యా శాఖా మంత్రి తక్షణం మూల్యాంకనంపై విచారణ జరిపి సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

యువతకు రుణాలు మంజూరు చేయాలి

జమ్మలమడుగు : నిరుద్యోగ యువతీ యువకులకు వ్యక్తిగత రుణాలను బ్యాంకుల ద్వారా ప్రభుత్వం మంజూరు చేయించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని కెనరా బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది నిరుద్యోగులుగా ఉన్నారని వారికి స్వయంకృషితో పైకి రావడం కోసం బ్యాంకులు సహకరించి వ్యక్తిగత రుణాలను మంజూరు చేయాలన్నారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా మంజూరు అయిన సబ్సిడీ రుణాల జాబితా ఇప్పటి వరకు రాలేదన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు సుభహాన్ తదితరులు పాల్గొన్నారు.